

ఒప్పంద పత్రాలు చూపిస్తున్న కోల్ ఇండియా అధికారి, హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ డైరెక్టర్ సంజయ్ సైగల్

బొగ్గు గనుల్లో హరిత విప్లవం

● పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి ● హార్ట్ ఫుల్‌నెస్ సంస్థతో ఒప్పందం

షాద్‌నగర్ అర్బన్/నందిగామ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బొగ్గుతీసి నిరుపయోగంగా వదిలేసిన గనుల్లో పచ్చదనాన్ని పెంచి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హాశాంతి వనంలో గురువారం బొగ్గు, గనుల శాఖలకు సంబంధించిన సలహా సంఘ సమావేశం జరిగింది. మంత్రి కిషన్‌రెడ్డితో పాటు సహాయ మంత్రి సతీష్‌చంద్ర దుబే, గనులశాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు, కోలిండియా చైర్మన్ పీఎం ప్రసాద్, సింగరేణి సీఎండీ బల్‌రాంనాయక్, పలువురు సీఎండీలు పాల్గొన్నారు. నిరుపయోగంగా ఉన్న బొగ్గు గనుల్లో పచ్చదనాన్ని పెంపొందించి, పర్యాటక కేంద్రాలుగా వృద్ధి చేయడానికి శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ నుంచి సాంకేతిక విజ్ఞానాన్ని, సలహాలను తీసుకోవాలని నిర్ణయించారు. మంత్రుల సమక్షంలో కోల్ ఇండియా, సింగరేణి సంస్థలతో రాంచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. కోల్ ఇండియా లిమిటెడ్ టెక్నికల్ డైరెక్టర్ అచ్యుత్ ఘటక్, సింగరేణి సీఎండీ బల్‌రాంనాయక్‌తో హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ డైరెక్టర్ సంజయ్ సైగల్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి, మార్చుకున్నారు.



ఆపరేషన్ ముస్కాన్‌పై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చిన్నారుల సంరక్షణే ధ్యేయంగా

ఆపరేషన్ ముస్కాన్ సాగాలి

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల సంరక్షణే ధ్యేయంగా ఆపరేషన్ ముస్కాన్ సాగాలని కలెక్టర్ హరిచందన అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆపరేషన్ ముస్కాన్(11)పై సమీక్ష ఏర్పాటు చేశారు. పోలీస్, రెవెన్యూ, కార్మిక, వైద్య ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థలతో కలెక్టర్ చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్‌ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో అనాథ పిల్లలను గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా తల్లిదండ్రులకు అప్పగించాలన్నారు. పని ప్రాంతాలు, బస్టాండ్లలో గుర్తించిన వారి వివరాలను సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ శైలజ, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ జానసన్, డీఈఓ రోహిణి, డీసీపీఓ శ్రీనివాస్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్ సమీక్షలో కలెక్టర్

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల ఇంటెన్సిఫైడ్ క్యాంపెయిన్‌పై కేంద్ర, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి అరుంధతి పట్నాయక్ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ హరిచందన దాసరి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో 29 వేల స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో మొబైల్ ఎక్స్‌రే మిషన్లు అందుబాటులోకి తీసుకొచ్చి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు.

వాట్సా‌ప్‌లో ఆస్తి పన్ను చెల్లింపు!

● అధునాతన సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్న జీహెచ్ఎంసీ

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పన్ను చెల్లింపునకు సాంకేతిక సేవల వినియోగ విస్తృతి పెంచాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. వాట్సాప్ ద్వారా బిల్లు చెల్లించే సేవలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కసరత్తు చేపట్టింది. సాంకేతిక సంస్థల నుంచి ప్రతిపాదనల కోసం ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ(ఈఓఐ) నోటిఫికేషన్ ప్రకటించింది. వాట్సాప్‌లో బిజినెస్ అకౌంట్ ఓపెన్ చేయడం ద్వారా ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ రుసుముతోపాటు సంస్థకు రావాల్సిన ఇతరత్రా ఆదాయాల వసూలుకు శ్రీకారం చుట్టనున్నారు. బ్యాంకు ఖాతాలు, క్రెడిట్/డెబిట్ కార్డులు, యూపీఐ ద్వారా పన్ను చెల్లించవచ్చని ఓ అధికారి తెలిపారు.

వడ్ల విత్తనాలు తీసుకొని డబ్బులు ఇవ్వడం లేదని

'నూజివీడు సీడ్స్' ఎదుట రైతుల ఆందోళన

పేట్‌బషీరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వడ్ల విత్తనాలు తీసుకొని డబ్బులు ఇవ్వడం లేదని సీడ్స్ పరిశ్రమ ఎదుట రైతులు గురువారం ఆందోళనకు దిగారు. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట్ మండల్ గెరిల్ల తండాకు చెందిన 150మంది రైతులు డీసీఎం, కార్లలో తరలివచ్చి కొంపల్లి మున్సిపల్ పరిధిలోని నూజివీడు సీడ్స్ పరిశ్రమ ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు రూ. 150 కోట్లు రావాలని, పండించిన పంటకు డబ్బులు ఇవ్వకపోవడంతో ట్రాక్టర్ల కిస్తీలు కట్టలేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు ఇచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదన్నారు. సోమవారం డబ్బులు ఇస్తామని నూజివీడు సీడ్స్ ప్రొడక్షన్ మేనేజర్ హరిప్రసాద్ రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళనను విరమించారు.

డాక్టర్ల కోసం క్లినిక్ టు కెమెరా పేరిట బూట్ క్యాంప్

● ఆగస్ట్, సెప్టెంబరులో నిర్వహణ



మణి పవిత్ర

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అర్హత, నైపుణ్యంగల డాక్టర్లు ఆన్‌లైన్‌లో సమాచారం పంచుకోవడానికి ముందుకొస్తే అసత్య వార్తలను అడ్డుకోవచ్చన్నారు క్రియేటివ్ వెర్స్ స్టూడియో అధినేత్రి డాక్టర్ మణి పవిత్ర. క్లినిక్ టు కెమెరా అంటూ ఇటీవల తాము నిర్వహించిన బూట్ క్యాంప్‌నకు అపూర్వ స్పందన లభించిందని, అదే తరహా బూట్ క్యాంప్‌లను ఆగస్ట్, సెప్టెంబరులో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్యాంప్‌లకు కొంతమంది డాక్టర్లు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ఆన్‌లైన్‌లో అర్హతగల డాక్టర్లు కనిపించాల్సిన ఆవశ్యకతను వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లోని సంస్థ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం చాలామంది ఆరోగ్య సమాచారం రీల్స్ ద్వారా పొందుతున్నారు. యూట్యూబ్ వీడియోలలో చూసినదే అసలైన సమాచారమనుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో డాక్టర్లు నిశ్శబ్దంగా ఉండటం ఎంతమేరకు సబబు అని ప్రశ్నించారామె.

రియల్ ఎస్టేట్ పేరుతో భారీ మోసం

(5వ పేజీ తరువాయి)

వసూలు చేశారు. ఈ మొత్తానికి ప్రామిసరీ నోట్లు, బ్యాంక్ చెక్కులు, ఎంఓయూలు ఇచ్చారు. వీరికి కొన్ని నెలల పాటు వడ్డీ చెల్లింపులు చేశారు. ఆ తరువాత పరారయ్యారు. మోసపోయామని గుర్తించిన బాధితులు బాచుపల్లి, కొల్లూరు, చందానగర్, మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు బెంగళూరులో మహేష్‌ను, నెల్లూరులోని కందుకూరులో ఉజ్వలను అరెస్టు చేసినట్లు డీసీపీ తెలిపారు. అయితే, ఫైన్ సొల్యూషన్స్ వెస్ట్రన్ ఆక్వా పేరుతో మహేష్ మరో రెండు కంపెనీలను కూడా ఏర్పాటు చేశాడని తమ విచారణలో గుర్తించినట్టు ఆయన తెలిపారు. కేసును ఆర్థిక నేరాల విభాగం ఇన్‌స్పెక్టర్ కె.వి.సుబ్బారావు బృందం దర్యాప్తు చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

ఖర్గే బహిరంగ సభను జయప్రదం చేయాలి

● ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

చిక్కడపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఖర్గే బహిరంగ సభను జయప్రదం చేయాలని, ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఎల్బీ స్టేడియానికి తరలిరావాలని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ పిలుపు ఇచ్చారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) తీసుకున్న జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎల్బీ స్టేడియంలో టీపీసీసీ ఆధ్వర్యంలో జరిగే కాంగ్రెస్ గ్రామ కమిటీల అధ్యక్షుల సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని గురువారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా హాజరై, గ్రామకమిటీల అధ్యక్షులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. దాదాపు వెయ్యిమంది నియోజకవర్గంలోని ఆరు డివిజన్ల నుంచి కాంగ్రెస్ నాయకులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు రావాలన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాశం అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్, ముషీరాబాద్ బ్లాక్ అధ్యక్షుడు వీడీ కృష్ణ, అంజియాదవ్, అభిషేక్‌కెన్నడీ, భాస్కర్, శీలంసత్యనారాయణ, మధుమతి, జయేందర్‌బాబు, కెన్నెడీ కృపారావు, పెండెం శ్రీనివాస్‌యాదవ్, నర్సింగ్‌ముదిరాజ్, సికింద్రాబాద్ పార్లమెంటు కోఆర్డినేటర్ వెంకటస్వామి, వెంకటేష్, కవిత, జఫీర్, సురేష్, సురేష్‌యాదవ్, లోకేష్‌యాదవ్, నర్సింగ్‌రావు, సాయికీర్త్, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి

రాంనగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు అందరికంటే ముందు వరుసలో ఉంటూ పార్టీని రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి తీసుకొచ్చేందుకు పాటుపడాలని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ తనయుడు కె.రాహుల్ సూచించారు. రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి ఆధ్వర్యంలో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ జన్మదినం సందర్భంగా బాగ్‌లింగంపల్లిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్‌తో కలిసి హాజరైన రాహుల్ రక్తదాన శిబిరం ప్రారంభించారు. అనంతరం జీహెచ్ఎంసీ కార్మికులకు దుప్పట్లు, అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్‌రాం, గడ్డం నవీన్, శ్రీనివాస్, రాంరెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాతిరి పార్థసారథి ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం చౌరస్తాలో పేదలకు అన్నదానం, చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జైపాల్‌రెడ్డి, గడ్డం సతీష్, కిరణ్, కలకోట అరుణ్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో రాంనగర్‌లోని జెమిస్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలోని 350 మంది విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కె.రాహుల్, జి.భరత్‌గౌడ్, రాజులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ సురేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **ముషీరాబాద్:** బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ జన్మదినం సందర్భంగా భోలక్‌పూర్‌లోని భవానిశంకర ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.విశ్వం, బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, ఓబీసీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, సీనియర్ కోవ రాహుల్‌తో కలిసి కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ నవీన్ గౌడ్, పార్టీ నాయకులు బాలకృష్ణ, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **కవాడిగూడ:** సేవా కార్యక్రమాల్లో బీజేపీ నేతలు ముందుండాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు గంటా శ్రీనివాస్ ఆధ్వర్యంలో కవాడిగూడ బండమైసమ్మనగర్ కమ్యూనిటీ హాలులో అంగన్‌వాడీ విద్యార్థులు, టీచర్లు, బీజేపీ నేతలు చిన్నారుల సమక్షంలో కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, డివిజన్ అధ్యక్షుడు దిలీప్‌యాదవ్, ప్రధాన కార్యదర్శులు కేశవ్, బొల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జెమిస్తాన్‌పూర్ పాఠశాలలో విద్యార్థులకు భోజనం ప్లేట్లను పంపిణీ చేస్తున్న బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్

ముషీరాబాద్‌లో బీజేపీ ఫ్లెక్సీబోర్డుల చించివేత

ముషీరాబాద్: ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ జన్మదినం సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో పలు చోట్ల ప్రధాన కూడళ్ల వద్ద బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డులను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. బుధవారం రాత్రి 11.30 గంటల వరకు ఉన్న ఫ్లెక్సీ బోర్డులు తెల్లవారేసరికి పూర్తిగా చించివేశారు. ముషీరాబాద్ చౌరస్తా, రాజాడీలక్స్ చౌరస్తా, ఆర్టీసీ క్రాస్‌రోడ్, బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన భారీఫ్లెక్సీ బోర్డులను చించివేశారు. దీనితో బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీ బోర్డులను చించివేసిన వారి వివరాలు సేకరించేందుకు సీసీఫుటేజీలను పరిశీలించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే అనుమతి లేకుండా రోడ్లపై ఏర్పాటు చేసినందుకే జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించారని పలువురు పేర్కొంటున్నారు.



కవాడిగూడ బండమైసమ్మ నగర్ కమ్యూనిటీహాల్‌లో అంగన్‌వాడీ చిన్నారుల మధ్య కేక్ కట్ చేస్తున్న బీజేపీ నేతలు

గ్రూప్1 నోటిఫికేషన్‌లో బీసీలకు తగ్గిన ఉద్యోగాలు

బర్కత్‌పుర, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్ 1 నోటిఫికేషన్‌లో బీసీలకు ఉద్యోగాలు తగ్గాయని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ ఆరోపించారు. గురువారం నింబోలిఅడ్డలోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త రోస్టర్ టేబుల్ ప్రకారం బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాలరావు, అనిల్, ప్రదీప్‌గౌడ్, మాణిక్‌రావు, ప్రశాంత్ నిమ్‌కర్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఉద్యోగి ఆత్మహత్య

బర్కత్‌పుర, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఉద్యోగి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ లలితానగర్‌లో నివాసం ఉంటున్న జి.అరవింద్(36) జీహెచ్ఎంసీలో కాంట్రాక్ట్ ఉద్యోగి. ఆయనకు వివాహం కాలేదు. ఇటీవల అక్సిడెంట్ జరగడం వల్ల ఇంటి వద్దనే ఉంటున్నాడు. అనారోగ్య సమస్యలు తీవ్రం కావడంతో జీవితంపై విరక్తి చెందిన అరవింద్ ఉప్పుగూడ రైల్వే స్టేషన్ సమీపంలో చెంగల్‌పట్టు ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు ప్రయాణికుల హ్యాండ్ బ్యాగుల చోరీ

రైలు ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగును దొంగ లాక్కుని పారిపోయాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన విజయ్‌కుమార్ భార్యతో కలిసి బికనూర్ - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తున్నాడు. మహారాష్ట్రలోని మోత్కేడ్ రైల్వే స్టేషన్ వద్ద భార్య చేతిలోని హ్యాండ్ బ్యాగును దొంగ చోరీచేశాడు. ఆ బ్యాగులో 4 గ్రాముల బంగారు రింగ్, వెండీ ఆభరణాలు, రూ.20 వేల నగదు, 2 సెల్‌ఫోన్‌లు ఉన్నాయి. విజయ్‌కుమార్ గురువారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు తదుపరి విచారణ కోసం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేశారు.

● మరో ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగును దొంగలు తస్కరించారు. బికనూర్-కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌రైలులో నగరానికి వస్తున్న రేఖాదేవి నిజామాబాద్ వడియారం రైల్వే స్టేషన్ వద్ద హ్యాండ్ బ్యాగును సీటుపై పెట్టి బాత్రూమ్‌కు వెళ్లింది. తిరిగొచ్చే సరికి హ్యాండ్‌బ్యాగు కనిపించలేదు. దానిలో 5 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు, ఒక సెల్‌ఫోన్ ఉన్నాయి. రేఖాదేవి కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ కోసం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి : ఎమ్మెల్యే కాలేరు

రాంనగర్/గోల్నాక, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, మూసారాంబాగ్ ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. గురువారం అంబర్‌పేటలోని సమస్యలపై జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి జోనల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూసారాంబాగ్ ఫ్లైఓవర్ పనులు నత్తనడకన సాగడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. బోనాల పండగ నేపథ్యంలో అన్ని ఆలయాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో అంబర్‌పేట డీఎంసీ మారుతిదివాకర్, ఏఎంవోహెచ్ హేమలత, ఈఈ ప్రశాంతి, డీఈ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణం మట్టితో చదును



పాఠశాల ప్రాంగణంలో మట్టి పోసిన సిబ్బంది

ముషీరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి బురదమయంగా మారిన ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణాన్ని గురువారం మట్టితో చదును చేశారు. వర్షం నీటికి స్కూల్ ప్రాంగణం బురదమయంగా మారడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదుల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని 'ఆంధ్రజ్యోతి'లో గురువారం వచ్చిన ముసురుతో ఇబ్బందులు అనే కథనానికి అధికారులు స్పందించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

మున్నూరుకాపులు అభివృద్ధి సాధించాలి: వీహెచ్

రాంనగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు సూచించారు. మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సర్దార్ పుటం పురుషోత్తమరావు పటేల్ గురువారం బాగ్‌అంబర్‌పేటలో వీహెచ్‌ను సన్మానించారు. ప్రధానకార్యదర్శి పెంటయ్య, కోశాధికారి సత్యనారాయణ, కార్యనిర్వహణ అధ్యక్షుడు వేణుగోపాల్, మహాసభ మాజీఅధ్యక్షుడు ఆనంద్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

కవాడిగూడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): 9న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆటో, మోటార్ కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ పిలుపు ఇచ్చింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఆటో, మోటార్ కార్మిక సంఘాల ఐక్యకార్యచరణ ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి బాగ్‌లింగంపల్లి, ఆర్టీసీ కళాభవన్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, అశోక్‌నగర్, జవహర్‌నగర్ మీదుగా దర్నాచౌక్ వరకు భారీ ఆటోర్యాలీ నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ, బీఆర్‌టీయూ, ఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఏడీఓడబ్ల్యూఏ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

● **గోల్నాక:** దేశవ్యాప్తంగా ఈనెల 9న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయు అంబర్‌పేట జోన్ కమిటీ ఆధ్వర్యంలో అంబర్‌పేటలో ప్రచారజాతాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నగర సహాయకార్యదర్శి ఎం.దశరథ్, ఉపాధ్యక్షులు జి.రాములు, అంబర్‌పేట జోన్ సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య పార్కు నుంచి ఇందిరాపార్కు వరకు ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో, మోటార్ కార్మిక సంఘాల నాయకులు

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి: ఎమ్మెల్యే గోపాల్

చిక్కడపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిపనులు వేగవంతంగా పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో కొనసాగుతున్న కచ్చామోరీలైన్ పనులను గురువారం ముఠా గోపాల్ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ సెక్షన్ డీఈ గీత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ వర్షాకాలంలో లోతట్టుప్రాంతాల్లో వరదముంపు సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్, నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, పాశం రవి, ఎస్‌టీ.ప్రేమ్, రాజ్‌కుమార్, విఠల్, కిరణ్‌కుమార్, సంతోష్, చందు, టింకు, పాండు, బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, సుజాత పాల్గొన్నారు.

బాకారంలో సమస్యలను పరిష్కరించాలి

రాంనగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని బాకారంలో డ్రైనేజీ, రోడ్డు, వీధి దీపాల సమస్యను వెంటనే పరిష్కరించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు సూచించారు. గురువారం డివిజన్‌లోని దయార మార్కెట్, రామాలయం, బాకారం, పిండిగిర్నీ వీధి తదితర ప్రాంతాలలో జీహెచ్ఎంసీ డీఈ గీత, జలమండలి డీజీఎం మోహన్‌రావుతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శంకర్ ముదిరాజ్, దామోదరరెడ్డి, నాయకులు ముచ్చకూర్తి ప్రభాకర్, ముదిగొండ మురళి, బాబుగౌడ్, విజయకృష్ణ, వెంకటేష్, శ్రీకాంత్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానపీఠం కన్నా ఎత్తుకు ఎదిగిన ఇనాక్

చిక్కడపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇనాక్‌కు జ్ఞానపీఠం రాకున్నా దానికన్నా ఎత్తు పీఠానికి ఎదిగిన సాహితీ రుషి ఆయన అని ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహంలో భాగంగా గురువారం డా.అరుణ గంధం రచించిన కొలకలూరి ఇనాక్ సాహిత్యం బహుముఖ తత్వం వ్యాస సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా ఏనుగు నరసింహారెడ్డి పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. కొలకలూరి ఇనాక్ దళితవాద సాహితీవేత్తగా భావిస్తారు కానీ ఆయన అణగారిన వర్గాల పక్షపాతి అన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షత వహించిన సభలో ప్రముఖ విమర్శకులు డా.కోయ కోటేశ్వరరావు, నాట్యగురువు రేణుకాప్రభాకర్, కిన్నెర రఘురామ్, గంధం అరుణ, ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొన్నారు.

'ఆ 27 బీసీ కులాలను మళ్లీ కలపొద్దు'

కవాడిగూడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీ జాబితా నుంచి తొలగించిన 27 బీసీ కులాలను తెలంగాణ బీసీ జాబితాలో చేర్చవద్దని తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నేతలు డాక్టర్ భాగయ్య, గడప శ్రీహరి, అంబటి సుధాకర్, కంటె రాంచందర్, మల్లేష్, కొమురయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ బీసీఏ హక్కుల పరిరక్షణ సమితి సమితి ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీసీఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నేతలు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే సేవాభావాన్ని అలవర్చుకోవాలి

చిక్కడపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిదశలోనే సేవాభావాన్ని అలవర్చుకోవాలని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం డివిజన్‌లోని జవహర్‌నగర్ ప్రభుత్వప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్, పావనివినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎందులోనూ తీసిపోరన్నారు.

ఆంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.2.9లక్షలు

చిక్కడపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2,09,852 వచ్చింది. రెండు నెలల హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ సిబ్బంది, భక్తులు ఆలయ ప్రాంగణంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ టి.శేఖర్, ముషీరాబాద్ మండలం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిరంజన్, దేవాలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం పర్యవేక్షణలో లెక్కించారు.

వైద్యరత్న అవార్డుల ప్రదానం

చిక్కడపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ గౌతమ్‌నగర్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ డాక్టర్లను లయన్స్‌క్లబ్ చైర్మన్, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు డా.ఎస్‌పీ భారతి సత్కరించి అవార్డులు బహూకరించారు. డా.జె.ప్రదీప్‌కుమార్, డా.షరీఫ్‌ఖానా, డా.కొండపల్లి అపర్ణ, డా.నవీన్‌సింగ్‌ఠాకూర్‌కు అవార్డులు బహూకరించిన ఎస్‌పీ భారతి మాట్లాడుతూ ఈ సమాజంలో పూర్వకాలం నుంచి వైద్యులకు ఎంతో పేరుప్రఖ్యాతులు ఉన్నాయన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. మదర్‌డైరీ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, శాస్త్రినగర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, రామ్‌నగర్ పరిధిలో 4 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

టీపీసీసీ గౌడ నేతలకు సత్కారం

రాంనగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన జై గౌడ ఉద్యమ జాతీయ అధ్యక్షుడు వట్టికోటి రామారావుగౌడ్, మాదా సత్యంగౌడ్‌ను తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో కమిటీ చైర్మన్ బి.బాల్‌రాజ్‌గౌడ్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ కన్వీనర్ ఆయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ విజయ్‌కుమార్‌గౌడ్, నాయకులు అంబాల నారాయణగౌడ్, దుర్గయ్యగౌడ్, నాగేష్‌గౌడ్, ఐలన్‌గౌడ్ పాల్గొన్నారు.

జలమండలి అధికారుల నిలదీత

నల్లకుంట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లో ఒకవైపు లోప్రెషర్ సమస్య ఎదుర్కొంటుండగా అదే మంచినీటి పైప్‌లైన్ నుంచి పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌కు కనెక్షన్ ఇవ్వడానికి జలమండలి అధికారులు ప్రయత్నించగా స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. అవసరం అయితే అపార్ట్‌మెంట్ వాసులకు ప్రత్యేక మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని తమ బస్తీకి ఉన్న పైప్‌లైన్ ద్వారా మంచినీటి సరఫరా చేస్తే ఊరుకునేది లేదని నిలదీశారు. దీంతో అధికారులు, సిబ్బంది పనులు ఆపేసి వెళ్లిపోయారు.

ప్రాజెక్టుల వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు మేలేం లేదు

నల్లకుంట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోని దక్షిణాది రాష్ట్రాలలో పాలకులు నిర్మిస్తున్న ప్రాజెక్టుల వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి ఒనగూరే మేలు ఏమీ లేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ పేర్కొన్నారు. గురువారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ ప్రాజెక్టుల కింద ఎన్ని లక్షల ఎకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉంది, ఎన్ని వేల ఎకరాలు సాగు అవుతున్నాయో, అవి ఏయే కులాల ఆధీనంలో ఉన్నాయో లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు.

చిక్కడపల్లిలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

చిక్కడపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు గురువారం స్టేషన్ పరిధిలో స్కూల్ బస్సులు, వ్యాన్లు, ఆటోడ్రైవర్లపై డ్రంకెన్‌డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆటోలలో పరిమితికి మించి స్కూల్ పిల్లలు కలిగిన వాహనాలు, సరైన పత్రాలులేని వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి స్కూల్ ఆటో నడుపుతున్న ఇద్దరిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులునమోదు చేశారు. నాలుగు ఆటోలపై పరిమితికి మంచి స్కూల్ పిల్లలను తరలిస్తుండగా కేసులు నమోదు చేశారు చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.వీరేశం పర్యవేక్షణలో ఎస్ఐ కె.సాయిరామ్, పీఎస్ సిబ్బంది ఈ డ్రైవ్‌లో పాల్గొన్నారు.

మల్లికార్జునఖర్గేను కలిసిన నంది శరత్



నగరానికి వచ్చిన సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను గురువారం సాయంత్రం ఏఐసీసీ కిసాన్‌సెల్ కో-ఆర్డినేటర్ నంది శరత్ కలిసి స్వాగతం పలికారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి